# జన్యులోప చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలి



చిన్నారులతో సినీ నటుడు కార్తీ

**చెన్నై, న్యూస్‌టుడే:** జన్యుపరంగా లోపంతో పుట్టే చిన్నారులు అనేక చేదు అనుభవాలతో జీవనయానం కొనసాగించాల్సి వస్తోందని 'లైసోసోమాల్ స్టోరేజ్ డిసార్డర్స్ సపోర్ట్ సొసైటి' పేర్కొంది. గురువారం దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జన్యుపరమైన లోపాలతో పుట్టిన రాష్ట్రానికి చెందిన 50 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధి డాక్టర్ సుజాతజగదీష్ మాట్లాడుతూ.. జన్యుపరమైన లోపంతో పుట్టిన చిన్నారులు చెవుడు, మూగతనం, నత్తి, నరాలలో లోపం వంటి ఎన్నో క్లిష్టతరమైన ఇబ్బందులు ఎదుర్కోవటం తప్పదని చెప్పారు. వీటిని సరిదిద్ది ఈ తరహా చిన్నారులకు పూర్తి స్థాయిలో సుఖజీవనం కల్పించటానికి అనేక అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అయితే భారీ వ్యయంతో కూడిన ఈ ప్రత్యేక చికిత్సలను తల్లిదండ్రులు భరించలేకపోవడంతో చిన్నారుల పరిస్థితి అత్యంత అస్తవ్యస్థంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటి అధ్యక్షుడు మంజిత్‌సింగ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆర్థిక సాయంతోనే ఈ లోపంతో పుట్టిన చిన్నారుల సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు. అతి అరుదైన ఈ సమస్యలకు చెందిన చిన్నారులకు ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టి ఉచితంగా చికిత్సలు అందించే విధంగా చర్యలు చేపట్టి చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు కార్తీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పథకాన్ని ప్రవేశపెట్టి అరుదైన ఈ తరహా చిన్నారులకు పునర్జీవం కల్పించాలని కోరారు. సొసైటీ చేస్తున్న కృషిని ప్రశంసించిన కార్తీ తనవంతు సహాయంగా రూ. 5 లక్షలను అందించారు.